క్లుప్తంగా

మాచారెడ్డి సింగిల్ విండో చైర్మన్‌గా స్వామి గౌడ్



మాచారెడ్డి: మాచారెడ్డి సింగిల్ విండో చైర్మన్‌గా డైరెక్టర్ స్వామి గౌడ్‌ను శుక్రవారం నియమించారు. మొన్నటివరకు కొనసాగిన చైర్మన్ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన నేపథ్యంలో స్వామి గౌడ్‌ను నియమించినట్లు డీసీవో రామ్మోహన్ తెలిపారు.

మహమ్మద్‌నగర్ తహసీల్దార్‌గా లత

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల తహసీల్దార్‌గా లత నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు వచ్చాయి. స్థానిక తహసీల్దార్ సవాయిసింగ్‌ను ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఏవోగా బదిలీ చేశారు. అక్కడ ఏవోగా పనిచేస్తున్న లతను మహమ్మద్ నగర్‌కు బదిలీ చేశారు.

పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడిగా అనిల్



అనిల్



శ్రీపాల్‌రెడ్డి

భిక్కనూరు: పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనిల్, ప్రధాన కార్యదర్శిగా శ్రీపాల్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. అంతకు ముందు అధ్యక్షుడిగా ఉన్న గిరిధర్ పదోన్నతిపై ఇసాయిపేట ఉన్నత పాఠశాలకు వెళ్లడంతో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అనిల్ మాట్లాడుతూ.. మండలంలో విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

రాహుల్, ప్రియాంక గాంధీ సేన జిల్లా అధ్యక్షుడిగా అనిల్



ఎల్లారెడ్డిరూరల్: రాహుల్, ప్రియాంక గాంధీ సేన జిల్లా అధ్యక్షుడిగా ఎల్లారెడ్డి మండలానికి చెందిన సభావత్ అనిల్‌నాయక్‌ను నియమిస్తూ రాహుల్ ప్రియాంక గాంధీ సేన జాతీయ ఉపాధ్యక్షుడు, దక్షిణ భారత ఇన్‌చార్జి అన్నం వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తాను కృషి చేస్తానని అనిల్‌నాయక్ అన్నారు. తనపై నమ్మకముంచి జిల్లా పదవిని అందించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



నిజాంసాగర్(జుక్కల్): అనారోగ్యానికి గురై అకాల మరణం చెందిన స్నేహితుడి కుటుంబానికి రూ. 17,600 నగదను శుక్రవారం సహాయంగా అందజేశారు. మాగి గ్రామానికి చెందిన యువకుడు కొల్ల పండరి వారం రోజుల కిందట మరణించారు. మృతునికి కుటుంబ పరిస్థితిని చూసిన మీకోసం మేము సేవా సమతి తరుపున యువత ముందుకు వచ్చారు. తలా కొంత నగదును జమ చేసి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. సేవా సమితి సభ్యులు మెంగారాం శ్రీనివాస్, కొల్ల సంగయ్య, చింతకింది సాయిలు, శ్రీనివాస్, దుర్గయ్య, నగేష్, శేఖర్, నాగరాజు, జైపాల్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



దోమకొండ: ప్రభుత్వ వసతి గృహల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వార్డెన్‌లు, సిబ్బంది చూసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు వారి తల్లితండ్రులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించి వారి చదువు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఆయన వెంట హాస్టల్ వార్డెన్ స్వామి, సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛతకు దగ్గరగా..

- బాన్సువాడ మున్సిపాలిటీకి ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 46వ ర్యాంకు
- ఉమ్మడి జిల్లాలో మెరుగు పడిన బాన్సువాడ బల్దియా



బాన్సువాడ మున్సిపాలిటీకి వచ్చిన స్వర్వేక్షణ్ ర్యాంకు



బాన్సువాడ డంపింగ్ యార్డ్

బాన్సువాడ: 2024–25 సంవత్సరానికి సంబంధించిన స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో రాష్ట్రంలో బాన్సువాడ మున్సిపాలిటీ 46వ ర్యాంకు సాధించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మిగతా మున్సిపాలిటీల కన్నా బాన్సువాడ బల్దియా మెరుగు పడిందనే చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లాలో బాన్సువాడ మున్సిపాలిటీ స్వచ్ఛతకు దగ్గరగా ఉంది. కొత్త కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పారిశుద్ధ్యం మెరుగు పడడంతో పాటు మున్సిపాలిటీల రూపురేఖలు మార్చడానికి ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు క్షేత్ర స్థాయిలో రోజుకో కార్యక్రమం నిర్దేశించారు. తడి–పొడి చెత్త వేర్వేరుగా సేకరించాల్సి ఉండగా ప్రజలకు అవగాహన కల్పించడంలో బల్దియా అధికారులు విఫలం కావడంతో చెత్త సేకరణలో ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడం లేదు. ఈ తడి–పొడి చెత్త సేకరణ కార్యక్రమం కార్యరూపం దాల్చాల్సిన అవసరం ఉంది.

అమలు కాని ప్రణాళిక..

ప్రతి మార్పు అభివృద్ధికి బాటలు అనే నినాదంతో 50 అంశాల్లో రోజుకో కార్యక్రమం చేపట్టాల్సి ఉంది. సామాజిక, స్వచ్ఛంద మహిళ సంఘాలను భాగస్వాములను చేస్తూ పారిశుద్ధ్యం, పచ్చదనం తదితర కార్యక్రమాలు నిర్వహించి, శిథిల భవనాలను గుర్తించి వాటిని తొలగించాలి. పలు కాలనీల్లో శిథిలావస్థకు చేరిన ఇళ్లను కూల్చివేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారనే విమర్శలున్నాయి. చాలా కాలనీల్లో ప్రణాళిక అమలు కాలేదు. ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేసి సొంతంగా శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలి. డంపింగ్ యార్డ్‌లో వసతుల కల్పనపై ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉంది. అధికారులు సమన్వయంతో ప్రణాళికా బద్ధంగా పనులు చేపడితే స్వచ్ఛతకు ఒక్క అడుగు దూరంలో ఉండేందుకు వీలుంటుంది.

వార్డు అధికారులదే కీలక పాత్ర..

పట్టణ అభివృద్ధిలో వార్డు అధికారులదే కీలక పాత్ర. అందుకు ప్రతి వార్డుకు ఓ అధికారిని నియమించారు. వీరు ఆశించిన స్థాయిలో పనులు చేయలేదనే ఆరోపణలున్నాయి. చాలా వరకు కార్యాలయానికే పరిమితమవుతున్నారు. వార్డుల్లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోతున్నాయి. వార్డు అధికారులు ప్రతి రోజూ ఉదయాన్నే వార్డుల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. వార్డు అధికారుల విధులకు సంబంధించిన ఉత్తర్వులను గతంలోనే పురపాలక శాఖ విడుదల చేసింది.

2024-2025 సంవత్సరం సర్వేలో..

దేశవ్యాప్తంగా జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే ఫలితాలను రాష్ట్రపతి ఈ ఏడాది జూలై 17న విడుదల చేశారు. ఇందులో రాష్ట్రాల వారీగా మున్సిపాలిటీల ర్యాంకులను ప్రకటించింది. అయితే రాష్ట్రంలో ఉన్న 143 మున్సిపాలిటీల్లో బాన్సువాడ మున్సిపాలిటీకి 46వ ర్యాంకు వచ్చింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి మున్సిపాలిటీకి 36వ ర్యాంకు, ఎల్లారెడ్డికి 67, నిజామాబాద్‌కు 74, బోధన్‌కు 49, ఆర్మూర్‌కు 29, భీంగల్ మున్సిపాలిటీకి 118వ ర్యాంకులు వచ్చాయి.

మొదటి స్థానానికి చేరేందుకు ప్రయత్నిస్తా

స్వచ్ఛత విషయంలో బాన్సువాడ మున్సిపాలిటీ నంబర్ వన్‌గా తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మున్సిపాలిటీ ఏర్పడిన తక్కువ కాలంలోనే అనుకున్న అభివృద్ధి సాధించాం. ప్రతి రోజూ పనులు పర్యవేక్షించాం. ప్రణాళిక బద్ధంగా పనులు చేశాం. ప్రజలు, అధికారులు సహకరించాలి.

– శ్రీహరి రాజు, కమిషనర్, బాన్సువాడ

నత్రజని వాడకాన్ని తాత్కాలికంగా ఆపాలి



బైరాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఏడీఏ అరుణ

బాన్సువాడ: వరి పంటలకు ఎండాకు తెగులు సోకిన నేపథ్యంలో రైతులు వరి పంటలకు నత్రజని ఎరువుల వాడకాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని బాన్సువాడ ఏడీఏ అరుణ సూచించారు. శుక్రవారం బీర్కూర్ మండలం బైరాపూర్ శివారులో ఎండాకు తెగులు సోకిన పంటలను ఆమె పరిశీలించారు. ఎండాకు తెగులు నివారణపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిలకలు తొడిగే దశలో ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి, వీటి చుట్టూ డాగు మచ్చలుగా మొదలై అంచుల వెంబడి మట్టల వరకు వ్యాపిస్తాయని అన్నారు. పసుపు పచ్చ జిగురు వంటి బ్యాక్టీరియా ఎండ వేడిమికి గట్టిపడి చిన్న చిన్న వుండలుగా ఏర్పడతాయని అన్నారు. నివారణకు నత్రజని ఎరువుల వాడకాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని సూచించారు. పొలం నుంచి నీటిని తీసేయాలని, ప్లాంటోమైసిన్ 0.2 గ్రా, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని అన్నారు. అగ్రిమైసిన్ 0.4 గ్రా, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని అన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



నస్రుల్లాబాద్: సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని షీటీం సభ్యులు సూచించారు. శుక్రవారం మండలంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ మోసాలకు గురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలన్నారు. సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని టీచర్లకు తెలియజేశారు. షీ టీం ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ మాధవరావు, షీ టీం మెంబర్స్ అనిల్, ప్రియాంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక మేటల తొలగింపునకు కొలతలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కన్నాపూర్ చౌదరి చెరువు కింద ఏర్పడిన ఇసుక మేటలకు గురువారం అధికారులు కొలతలు తీసుకున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షానికి చౌదరి చెరువు కట్ట తెగిపోయి పంట పొలాల్లో ఇసుక మేటలు, మొరం దిబ్బలు ఏర్పడ్డాయి. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీఆర్‌డీవో సురేందర్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ సిబ్బంది కొలతలు తీశారు. ఉపాధి హామీ పథకం కింద వాటిని తొలగించనున్నట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. ఏపీవో నరేందర్, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఆడిట్‌లో తప్పులు దొర్లకుండా చూడాలి



మద్నూర్‌లో మాట్లాడుతున్న సీబీవో ఆడిటర్ కుమార్

మద్నూర్(జుక్కల్): గ్రామ సంఘాల అంతర్గత ఆడిట్‌లో తప్పులు దొర్లకుండా చూడాలని సీబీవో ఆడిటర్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ సంఘాల సహాయకులకు గ్రామ సంఘం అంతర్గత ఆడిట్ చేయడంపైన శిక్షణ అందించారు. గ్రామ సంఘం పుస్తకం, రసీదు పుస్తకం, నగదు పుస్తకం, సాధారణ లెడ్జర్ పుస్తకాలు ఏ విధంగా రాయాలో వివరించారు. అనంతరం గ్రామ సంఘాల వీవోఏలతో ఏపీఎం జగదీష్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్యాంక్ లింకేజీ ప్రగతి గురించి ఆయన చర్చించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ రుణం రూ.43.13 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. ఇంత వరకు రూ.17.31 కోట్ల రుణం ఇప్పించామన్నారు. రుణాలు తీసుకున్నవారు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, సీసీ రాములు, సంగీత, రాజశ్రీ, అనిల్, సుమిత్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన తాత్కాలిక రోడ్డు పనులు



లింగంపల్లి(ఖుర్దు) వద్ద తాత్కాలికంగా వేస్తున్న రోడ్డు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లి(ఖుర్దు) శివారులోని పాముల వాగు వద్ద తాత్కాలిక రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభించారు. గత నెల కురిసిన భారీ వర్షాలకు మల్లారం చెరువు కట్ట తెగిపోవడంతో కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఉన్న పాముల వాగు వంతెనకు ఇరువైపులా రోడ్డుతో కొట్టుకుపోవడంతో పాటు వంతెన కుంగిపోయింది. ఈ నెల 4న సీఎం రేవంత్‌రెడ్డి వంతెనను పరిశీలించారు. అనంతరం అధికారులు తెగిపోయిన వంతెన ప్రదేశంలో మొరం వేసి రాకపోకలు పునరుద్ధరించారు. ఈ వంతెనపై నుంచి భారీ వాహనాల రాకపోకలను నిలిపేయడంతో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దాంతో తాత్కాలిక వంతెనకు ప్రభుత్వం రూ.కోటి విడుదల చేసింది. బ్రిడ్జి వద్ద వాగు నీరు వెళ్లడానికి భారీ పైపులు ఏర్పాటు చేసి ఇరువైపులా రాళ్లు, మొరం వేసి తాత్కాలిక రోడ్డు వేస్తున్నారు. నూతన వంతెన నిర్మాణం జరిగే వరకు రాకపోకలకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక రోడ్డు వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మోడల్ ఇందిరమ్మ ఇల్లు పరిశీలన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయం సమీపంలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇల్లును శుక్రవారం ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే రూ.5 లక్షలతో ఇలాంటి నిర్మాణాలు చేపట్టవచ్చని సూచించారు. లబ్ధిదారులు మండల పరిషత్ వద్ద నిర్మించిన మోడల్ హౌజ్‌ను పరిశీలించి నిర్మించుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

తిప్పాపూర్‌లో గాజుల కార్యక్రమం



భిక్కనూరు: తిప్పాపూర్‌లో వంగేటి వారి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గాజుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాజులను గౌరిదేవిగా భావిస్తూ మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక భోజనాలు నిర్వహించుకున్నారు. ఆర్మూర్ ప్రాంతంలో గాజుల కార్యక్రమం ప్రతి ఏడాది కొనసాగుతుంది. తిప్పాపూర్‌లో తొలిసారిగా గాజుల కార్యక్రమం నిర్వహించడం గమనర్హం.

నానో యూరియాపై అవగాహన



బీబీపేట: మాదాపూర్‌లో రైతులకు నానో యూరియా గురించి ఏఈవో రాజేష్ శుక్రవారం అవగాహన కల్పించారు. నానో యూరియా వల్ల ఖర్చులు తగ్గుతాయని, అలాగే వాతావరణం కాలుష్యం కాకుండా కాపాడుకోవచ్చని ఆయన తెలిపారు. డిజిటల్ పంట నమోదు కూడా సర్వే నంబర్ల వారీగా చేశారు.

కోర్టు విధుల బహిష్కరణ



ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డిలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి శుక్రవారం నిరసన తెలిపారు. హైదరాబాద్‌లో న్యాయవాదిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఎల్లారెడ్డిలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌రావు, న్యాయవాదులు శ్రీనివాస్, పండరి, సతీష్, సాయి ప్రకాష్, శ్రీకాంత్, నవీద్, తదితరులున్నారు.

‘స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు’

రామారెడ్డి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలతో పాటు సర్పంచుల స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్ జోస్యం చెప్పారు. ప్రవీణ్ గౌడ్ అధ్యక్షతన సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌రెడ్డి, ల్యాగల ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా ఎండీ రావుఫ్, కార్యదర్శిగా అటికెల కిషన్ యాదవ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా లక్కాకుల రాజశేఖర్, ముఖ్య సలహాదారులుగా తూర్పు రాజు, రంగు రవీందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి నారెడ్డి, పిప్పరి లింగం, వెంకట్ స్వామి, అరవింద్ గౌడ్, కిషన్ గౌడ్, ఠాగూర్, విజయ్ సింగ్‌లను ఎన్నుకున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయతీ కార్మికులందరికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని శుక్రవారం ఎంపీడీవో నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండల పంచాయతీ వర్కర్స్ 120 మందికి రావాల్సిన రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించేలా చూడాలని ఎంపీడీవోను కోరారు. దసరా, దీపావళి పండుగల సందర్భంగా ప్రతి కుటుంబంలో ఖర్చులు ఎక్కువగా ఉంటాయని, కార్మికులందరికి 2 నెలల వేతనాలు గ్రీన్ చానల్ ద్వారా తమ అకౌంట్స్‌లో వేయాలని కోరారు.

అనుమతి లేని స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి



బాన్సువాడ : పిట్లంలో అనుమతి లేని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బాన్సువాడలో సబ్ కలెక్టర్ కిరణ్మయికి విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..అనుమతి లేని పాఠశాలలో విద్యార్థులు చదివితే భవిష్యత్‌లో విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం ప్రతినిధులు బోడ అనీల్, డీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాథోడ్ జీవన్, తదితరులున్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ నేతల అరెస్ట్



తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు మోహన్



పెద్దకొడప్‌గల్‌లో రోడ్డుపై ఆందోళన చేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు

హలో లంబాడీ– చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగే సభకు వెళ్తున్న లంబాడా హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) నేతలను తాడ్వాయి, పెద్దకొడప్‌గల్ మండలాల్లో ముందస్తు అరెస్టులు చేశారు. హైదరాబాద్‌కు వెళ్లకుండా స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ..లంబాడీల సమస్యలను పరిష్కరించాలన్నారు. అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామన్నారు. అరెస్టులకు నిరసనకు రోడ్లపై ధర్నా చేపట్టారు. శుక్రవారం సాయంత్రం నేతలను విడుదల చేశారు.

– తాడ్వాయి/పెద్దకొడప్‌గల్

రవాణా సౌకర్యం మెరుగుపర్చాలి



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రవాణా వ్యవస్థను మెరుగుపర్చాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిలో వారు మాట్లాడుతూ.. భారీ వరదల కారణంగా రవాణా వ్యవస్థ దెబ్బతిన్నదని, ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డికి రవాణా వ్యవస్థ మెరుగపడకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. దసరా వస్తున్న దృష్ట్యా బట్టల కొనుగోలు, ఇతర పనుల కోసం కామారెడ్డికి వెళ్లేందుకు జనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయని.. దీనిని దృష్టిలో ఉంచుకొని రవాణా వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. నాయకులు జలంధర్ రెడ్డి, ఆదిమూలం సతీష్, రాజు, ఇమ్రాన్, సాయిలు, నర్సింలు, పృథ్వీరాజ్, అరవింద్ తదితరులున్నారు.

సంక్షిప్తం

వరద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శుక్రవారం వరద బాధితులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావర వస్తువులను పంపిణీ చేశారు. 12 మంది బాధితులకు నిత్యావసర వస్తువులతో పాటు టార్పాలిన్ కవర్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ..పేదవారికి రెడ్ క్రాస్ సొసైటీ అండగా ఉంటుందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజన్న, కార్యదర్శి రఘుకుమార్, డివిజనల్ చైర్మన్ రమేష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గడ్డం కిష్టారెడ్డి, సభ్యులు పీవీ నరసింహం, తహసీల్దార్ శ్వేత, తదితరులు పాల్గొన్నారు

నాగిరెడ్డిపేటలో..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయం వద్ద ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు వరద బాధితులకు రిలీఫ్ కిట్లను అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మంది వరద బాధితులకు తహసీల్దార్ శ్రీనివాస్ రావు చేతుల మీదుగా కిట్లను పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, వైస్ చైర్మన్ నాగరాజ్ గౌడ్, సెక్రెటరీ రఘుకుమార్, కరస్పాండెంట్ పీవీ నరసింహం, డివిజన్ చైర్మన్ రవీందర్ గౌడ్, సాయిలు, నర్సింలు, మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, ఆర్ఐ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అడివిలింగాల చెరువు పరిశీలన

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని అడివిలింగాల శివారులోని చెరువును నీటి పారుదల శాఖ సీఈ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. గ్రామ శివారులోని చెరువు కట్ట తెగి పోవడంతో నీరు వృధా పోకుండా తాత్కాలిక పనులు చేయాలని, పోచారం కాలువకు పడిన బుంగలను పూడ్చి రైతులకు సాగు నీరు అందేలా చర్యలను తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎస్ఈ యశస్విని, ఈఈ మల్లేష్, డీఈ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

రైతులను ఆదుకోవాలి



మాచారెడ్డి: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేల్పూరు భూమయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఘనపూర్‌లో నిర్వహించిన ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు నర్సన్న, నాయకులు నర్సయ్య, చిన్న అలీ, సుజాత, పెద్ద అలీ, తదితరులు పాల్గొన్నారు.